నేటి నుంచి అసెస్మెంట్ -1 పరీక్షలు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 20 : జిల్లాలోని 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు నేటి నుంచి సమ్మెటివ్ అసెస్మెంట్ –1 పరీక్షలు ప్రారంభమవుతున్నాయని డీఈవో ముద్దమల్ల రాజేందర్ ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులు 10,383 మంది, హైస్కూల్ స్థాయి విద్యార్థులు 17,660 పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. 28వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. నవంబర్ 2న జవాబు పత్రాల మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని, నవంబర్ 5న మార్కులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. నవంబర్ 16న తల్లిదండ్రులతో టీచర్లు సమావేశం నిర్వహించి విద్యార్థుల మార్కుల ఆధారంగా వారి ప్రతిభను చర్చించి ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలని సూచించారు. పరీక్షలు సజావుగా జరిగేలా జిల్లా ఉమ్మడి పరీక్షల కార్యదర్శి ఒంటేరు చంద్రశేఖర్, అసిస్టెంట్ కార్యదర్శి శనిగరపు భద్రయ్య పర్యవేక్షణ చేయాలని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

కాటారం, అక్టోబర్ 20 : కాటారంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి ప్రకటనలో తెలిపారు. ఈనెల 30లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. కాగా, రెండేళ్ల ఎలక్ట్రిషియన్ కోర్సులో 20 సీట్లు, ఫిట్టర్ విభాగంలో 20 సీట్లు, సీఓపీఏలో 24 సీట్లు, డ్రాట్సమన్ సివిల్‌లో 24 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

మల్హార్, అక్టోబర్ 20 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొయ్యూరు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలం రుద్రారం జీపీ పరిధి చిగురుపల్లి గ్రామానికి చెందిన కుర్రి రవితేజ (20) పెద్దపేట గ్రామానికి చెందిన ఓ యుతిని పెళ్లి చేసుకుందామని ఈనెల 5న ఇంటి తీసుకొచ్చాడు. దీంతో గ్రామంలో ఉండే యువతి బంధువులు దాడి చేయడంతో అవమానంతో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు భూపాలపల్లి జిల్లా దవాఖానకు తరలించి, మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాకానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అందించినా ఫలితం లేదని వైద్యులు తెలుపడంతో ఈనె 19న రవితేజను ఇంటికి తీసుకచ్చారు. కాగా, ఇంటి తీసుకొచ్చిన కొద్ది సేపటికే మృతిచెందినట్లు ఎస్సై చెప్పారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మీయ సేవా సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 20 : అంబేద్కర్ సెంటర్‌లో భూపాలపల్లి ఆత్మీయ సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బయ్యన మహేందర్ మాట్లాడారు. సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నోట్ బుక్కులు, పుస్తకాలు, ప్యాడ్స్ ప్రతి సంవత్సరం ఇస్తున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద ప్రజల ఆకలి తీర్చడం కోసం అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మీయ సేవా సొసైటీ సభ్యులు మాటూరి క్రాంతికుమార్, పైళ్ల తిరుపతి, బండి శ్రీనివాస్, కుమారస్వామి, పటాన్ సాకేత్, కిన్నెర కుమార్, మేడిపల్లి అమర్‌కుమార్ పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

ములుగురూరల్, అక్టోబర్ 20 : ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటన మల్లంపల్లి శివారులోని ఫంక్షన్‌హాల్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఇసుక లోడ్ గల లారీని డ్రైవర్ జాతీయ రహదారిపై నిలిపి ఉంచాడు. ఈ క్రమంలో ఏటూరునాగారం వైపు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న మరో లారీ ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆగి ఉన్న లారీ రోడ్డు పక్కన బోల్తా పడగా ఢీకొట్టిన లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కాగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం/ చిట్యాల, అక్టోబర్ 20 : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం ఆయన గణపురం, చిట్యాల మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గణపురం మండలం ధర్మారావుపేట నుంచి అప్పయ్యపల్లి వరకు (వయా నగరంపల్లి) రూ.40 లక్షలతో బీటీ రోడ్డు, లక్ష్మీరెడ్డిపల్లి గ్రామంలో రూ.25 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఇటీవల ఇరిగేషన్ శాఖలో ఏఈఈగా ఉద్యోగం పొందిన కాంతాల రాజశేఖర్‌రెడ్డి, డీఎస్సీలో ఉద్యోగం సాధించిన పెంచాల మౌనిక, రమేశ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రూ.2.81 కోట్లతో చిట్యాల మండలం బావుసింగ్‌పల్లి, ముచినిపర్తి, జూకల్ గ్రామాల బీటీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మూలశంకర్‌గౌడ్, నాయకులు దొడ్డి కిష్టయ్య, చిలకల రాయకొమురు కొమురయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించి భూపాలపల్లికి పేరు తేవాలి

భూపాలపల్లి రూరల్ : జాతీయ స్థాయిలో రాణించి భూపాలపల్లికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే జీఎస్ఆర్ అన్నారు. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు కేరళలో సీనియర్ నేషనల్ స్విమ్మింగ్ వాటర్ పోలో గేంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 12 గోల్స్ చేసి ఆంధ్రప్రదేశ్ జట్టుపై గెలిచింది. ఈ మ్యాచ్‌లో భూపాలపల్లి స్విమ్మర్ పైడిపల్లి సాయి వెంకట్ ఐదు గోల్స్ చేసి మ్యాన్ అఫ్ ది మ్యాచ్ అవార్డు తీసుకున్నాడు. అలాగే జూలైలో హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన స్టేట్ మీట్ స్విమ్మింగ్ పోటీల్లో సబ్ జూనియర్ 50 మీటర్ల బెస్ట్ స్ట్రోక్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ గెలిచాడు. దీంతో ఆదివారం సాయంత్రం వీరిద్దరిని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కోచ్ పాక శ్రీనివాస్, స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ మదన్ మోహన్‌ను అభినందించారు. కార్యక్రమంలో జల్లి రమేశ్, ప్రశాంత్‌రెడ్డి, ప్యారడైజ్ వేణు, తిరుపతి, శ్రీరాములు, ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, చల్లూరి మధు, క్యాతరాజు సాంబమూర్తి, బుర్ర కొమరయ్య, ముంజాల రవీందర్ పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో హనుమకొండ అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ దవాఖాన యజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

గణపురం : బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

ఇసుక జీరో దందాపై పోలీసుల తనిఖీ

రోడ్డు పక్కన డంప్ చేసిన ఇసుక

మహదేవపూర్, అక్టోబర్ 20 : మండలంలో గోదావరి పరీవాహక ప్రాంతం లో నడుస్తున్న ఇసుక క్వారీల నుంచి అధిక లోడ్, జీరో దందాపై పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. శనివారం మండలకేంద్రం గుండా అధిక లోడుతో వెళ్తున్న మూడు ఇసుక లారీలను పోలీసులు గుర్తించి సీజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం మండలంలోని ఓ ఇసుక క్వారీ నుంచి లారీలో ఇసుక నింపుకుని ఎస్కార్ట్‌గా బయలుదేరినట్లు సమాచారం. ముందుగా ఓ ఇసుక లారీ కాటారం చెక్ పోస్టు వద్దకు చేరుకోగా ఎలాంటి వేబిల్లు లేకపోవడంతో పోలీసులు పట్టుకున్నారు. కాగా, వెనుకాలే వస్తున్న మరో రెండు లారీలకు పట్టుబడిన లారీ డ్రైవర్ సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన సదరు ఇసుక లారీల ఓనర్లు, డ్రైవర్లు మహదేవపూర్ మండలకేంద్రంలోని అయ్యప్ప టెంపుల్ వద్ద ప్రధాన రహదారి పక్కనే ఇసుకను అన్లోడ్ చేసి పారిపోయినట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై పవన్‌కుమార్‌ను వివరణ కోరగా కాటారం తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను గుర్తించడంతో దుండగులు రోడ్డు పక్కకు పారబోసి పోయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇసుక పంచనామ కోసం తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చామన్నారు. పారిపోయిన లారీ డ్రైవర్లను గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజ్‌లు పరిశీలిస్తున్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 20 : మావోయిస్టులకు సహకరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై దాసరి సుధాకర్ అన్నారు. ఆదివారం దూదేకులపల్లి గ్రామ శివారు కోయగూడెంలో ఎస్సై సుధాకర్, సివిల్ అండ్ స్పెషల్ పార్టీ బృందాలు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గొత్తికోయ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కొత్తవారు ఎవరైనా వచ్చారా అని విచారించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 20 : ఉప కులాలను A గ్రూపులో చేర్చి 7 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎంబీఎస్సీ 57 ఉప కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు, భూపాలపల్లి ఇన్‌చార్జి గడ్డం తిరుపతి అన్నారు. ఆదివారం అంబేద్కర్ సెంటర్‌లో 57 ఉపకులాల ఆధ్వర్యంలో అక్టోబర్ 21 ఉదయం ఇందిరాపార్క్ వేదికగా నిర్వహించనున్న చలో హైదరాబాద్ 'నిరసన దీక్ష' కరపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల పరంగా ఎంతో అన్యాయానికి గురైనామని, ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోమస భూమయ్య, రాష్ట్ర నేతకాని సంఘం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల మధన్‌మోహన్, జిల్లా ప్రధాన కార్యర్శి బొతు రాజేశ్, దక్కాలి సంఘం అధ్యక్షుడు కర్నెకంటి గోపాల్, జిల్లా అధ్యక్షుడు గడ్డం ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కర్నెకంటి అమరేందర్, చిలుక శేఖర్, సహాయ కార్యదర్శి దామోదర్, చిలుక భిక్షపతి, గడ్డం కరుణాకర్, జిల్లా నాయకులు జీ లక్ష్మణ్, జీ మురళి పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ యూత్ విభాగం ఉపాధ్యక్షుడిగా ప్రదీప్

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 20 : తెలంగాణ ముదిరాజ్ మహాసభ భూపాలపల్లి యూత్ ఉపాధ్యక్షుడిగా జోడు ప్రదీప్ ముదిరాజ్‌ను నియమిస్తూ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ యువత విభాగం అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్ నియామకపత్రం అందజేశారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ హాజరై జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రదీప్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చాడ కృష్ణ స్వామి ముదిరాజ్, మత్స్య శాఖ జిల్లా చీఫ్ ప్రమోటర్ చెలుకల పాణి ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌళి, ఉపాధ్యక్షులు జోడు శ్రీను, సాద మల్లయ్య గణపురం మండల అధ్యక్షుడు బోయిని సాంబయ్య ముదిరాజ్, జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ దార్ల ఆనంద్, జిల్లా యూత్ అధ్యక్షుడు ధనుంజయ్ పాల్గొన్నారు.

కోదండరాం మౌనం వీడాలి

- అశోక్‌నగర్ ఘటనపై స్పందించాలి
- సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌నాయక్

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 20 : నిరుద్యోగుల ఆర్తనాదాలతో అశోక్‌నగర్ మార్మోగుతోందని, కోదండరాం ఎందుకు మౌనంగా ఉంటున్నారని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ సంతోష్‌నాయక్ అన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఈబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. టాప్ మార్కులు వచ్చినా జనరల్‌గా కాకుండా, రిజర్వేషన్‌గా పరిగణించడం వల్ల మరో రిజర్వ్‌డ్ అభ్యర్థికి అవకాశం లేకుండా పోతోందని స్పష్టం చేశారు. యూపీఎస్సీ అమలు చేస్తున్న ఆ విధానాన్ని టీజీపీఎస్సీ ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు జీవో 55 ప్రకారం అన్ని వర్గాల నిరుద్యోగులు, విద్యార్థులకు న్యాయం చేశారని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మైనార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు బలహీన వర్గాల హక్కులను కాపాడాలని కోరారు. జీవో 29 రద్దు చేసి గ్రూప్స్ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. రాజకీయాలు పక్కనబెట్టి విద్యార్థుల సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి, అక్టోబర్ 20: మండల ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి నాగరాణి సూచించారు. ఆదివారం మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన ఇంజపల్లి మౌనిక పురిటి నొప్పులు రాగా పీహెచ్‌సీలో నార్మల్ డెలివరీ చేసినట్లు చెప్పారు. సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఆసుపత్రిలో ప్రసూతి సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, స్టాఫ్‌నర్స్ కల్పన, ఆశా కార్యకర్త కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకారులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర అధ్యక్షుడు రాఘవాచారి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాఘవాచారి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 20 : స్వర్ణకారులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి అన్నా రు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగరేణి ఫంక్షన్ హాల్లో జిల్లా స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాఘవాచారి హాజరై సంఘం జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామగిరి సదానందాచారి, ప్రధాన కార్యదర్శిగా కట్ట శంకరమూర్తితో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తున్న స్వర్ణకారులకు పని దొరకక వేరే వ్యక్తుల వద్ద కూలీ పని చేస్తున్నారన్నారు. స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. లేకపోతే నిరసన కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేవూరి వెంకటస్వామి, కోశాధికారి గొట్టిముక్కుల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రామోజు భిక్షపతి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ట ఈశ్వరప్రసాద్, భూపాలపల్లి మండల అధ్యక్షుడు కట్కోజుల రాజు, ప్రధాన కార్యదర్శి కొండపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇండియా ఫొటోగ్రఫీ సమ్మిట్‌కు ఎపికైన ఫొటో

ఇండియా ఫొటోగ్రఫీ సమ్మిట్‌లో మండల వాసికి గుర్తింపు

మహదేవపూర్, అక్టోబర్ 20 : హైదరాబాద్‌లో ఈనెల 15న నిర్వహించిన ఇండియా ఫొటోగ్రఫీ సమ్మిట్– 2024 జాతీయ ఛాయా చిత్ర పోటీల్లో మండలకేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ రాజు తీసి న ఫొటో ఉత్తమ ఛాయా చిత్రంగా ఎంపికైంది. పండుగలు వాటి ప్రాముఖ్యత అనే అంశంపై మహారాష్ట్ర కొల్హాపూర్ పఠాన్ కొడలిలో జరిగిన పసుపు పండుగపై తీసిన ఫొటో ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

రిటైర్మెంట్ ప్లానింగ్ ఇలా..

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మరువద్దు

రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలాచాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్లైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతరం జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

పొదుపుపై ధరల దెబ్బ

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. అందువల్ల కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

ఇదీ సంగతి..

రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000 లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని.

అధిక నిధి ఎలా?

ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

ఈక్విటీల్లో పెట్టుబడులు

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరి అని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్–టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్–టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్లైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

పెట్టుబడుల వర్గీకరణ

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, నగదు–బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒక ట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లు

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్పకాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్–రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

గుర్తుంచుకోండి

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం ఎఫ్‌డీ, ప్రభుత్వ పథకాలు బెటర్. పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. ఐటీ మినహాయింపులూ ఉంటాయి.

రాబడి

బిల్లుల భారం తగ్గేదెలా?

క్రెడిట్ కార్డ్ బకాయిల చెల్లింపులకు దారులివీ..

క్రెడిట్ కార్డుల్ని సవ్యంగా వినియోగిస్తే వాటితో ఎన్నో లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితుల నిర్వహణలో వీటి పాత్ర ఎంతో ప్రభావవంతం. కానీ దురదృష్టవశాత్తూ చాలామంది ఈ క్రెడిట్ కార్డుల వాడకంతో మితిమీరిన ఖర్చుల వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే బిల్లులను చెల్లించలేని దుస్థితికి చేరుకుంటున్నారు. అయితే భారమైన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో..

ఈఎంఐల్లోకి మార్చడం

చాలా క్రెడిట్ కార్డు సంస్థలు బకాయిలను ఈఎంఐల్లోకి మార్చుకునే సౌకర్యం వినియోగదారులకు ఇస్తున్నాయి. నిజానికి మెజారిటీ బ్యాంకులు ఈ సదుపాయాన్ని ఉచితంగానే కార్డుదారులకు అందిస్తున్నాయి. దీనివల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో నగదును సమకూర్చుకునే భారం తప్పుతుంది. అయితే క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐల్లోకి మార్చుకునే ముందు కనిపించని చార్జీలు ఏమైనా ఉన్నాయా?, ప్రాసెసింగ్ ఫీజులుంటాయా? అన్నది జాగ్రత్తగా చూసుకోవడం మంచిది